# బాంబు తగూ

మా చిన్న కుర్రాడికి డిక్టేషన్ చెబుతూ బాబు అని రాయమంటే బాంబు అని రాసినందుకు నవ్వుకున్నాం. మావారు వీడు యాటం సైంటిసు అయ్యే లక్షణాలు కనపడుతున్నాయ్ అని సంతోషించారు. నేను సంతోషించలేదు. బాంబులు ప్రేల్చడం మన యింటా వంటా లేదు. పనికిరాదు అని వారించా. "ఓసీ వెర్రిదానా మన ఇండియా బాంబు ప్రేల్చబట్టే గదా మన్ని గురించి నలుగురూ నాలుగు రకాలుగా చెప్పుకుంటున్నారు. మన పేరు నలుగురి నోట్లో నాన్తే మనకు ప్రతిష్ఠో అప్రతిష్ఠో తప్పకుండా వస్తుంది. సైన్సు డెవలప్ కాకపోబట్టే ఇండియా అంటే కోతులు కుక్కలు అర్ధదిగంబర అర్ధాకలి రాజ్యం అని అంతా అనుకుంటున్నారు" అని మా వారు ఓ గంభీరోపన్యాసం దంచారు.

"ఇప్పుడు మట్టుకు మనది అర్ధాకలి అర్ధనగ్న మనుషులున్న రాజ్యం కాదా? ఈ బాంబు పేల్చడం వల్ల మన్ని చూసి ఎవరో భయపడాలి. మనకు కీర్తి రావాలి అనే వ్యామోహం లేదంటారా?" అని అడిగా.

"ఇలాటి వెర్రి మొర్రి ప్రశ్నలు వేస్తే నిన్ను మీసా కిందో, డి.ఐ. ఆర్. కిందో కటకటాల వెనుక తోసేస్తారు" అని భయపెట్టారు.

"అలా దారికి రండి. భయపెట్టి మనల్ని పరిపాలించాలని మీ సర్కారు వారు ఎందుకనుకుంటున్నారు?"

"వారికుండే భయాలు వారి కుండడం వల్ల."

"మనం మన ముద్దుల బాంబును విడిచేసి చాలా దూరం వచ్చాం. మళ్ళీ బాంబు దగ్గరకే వెళ్దాం" అన్నా.

"అలా వెళ్ళకూడదు. ఇంటి దీపం అని ముద్దెట్టుకుంటే మూతి కాలదా!" అని దీపం సామెత చెప్పారు.

"ఈ డొంక టర్నింగు లెందుకు కాని మనకు బాంబు లెందుకో చెప్పండి ముందు" అని నిలదీశా.

"అదేమిటే వెర్రిదానా? మనకి బాంబులు లేకపోతే మనం ఏ రష్యా నుంచో నువ్వు పక్కింటి బామ్మగారి నుంచి తలగొట్టి మరచెంబు గ్లాసుడు పంచదార అప్పట్టుకొచ్చినట్లు అప్పు పట్రావాలి. పైగా మనకి బాంబులు ఎవరూ అప్పివ్వరు."

"బాంబులు చెయ్యకపోతే ఆ డబ్బెట్టి మరోటీ మరోటీ — రోడ్లెయ్యటం, దీపాలు పెట్టడం, మంచినీళ్ళ సప్లయి చెయ్యడం లాటి సవాలక్ష మంచిపన్లు చెయ్యొచ్చును గదా" అని క్రోశ్నించాను.

మావారు నవ్వారు.

"ఓసీ వెర్రిదానా— బాంబులు శాంతియుత ప్రయోజనాల కోసం అని మన శ్రీ గవర్మెంటువారు గొంతు చించుకుని హోరెత్తి చెబుతున్నారు వినపడలేదా అన్నా...."

"అంటే—"

"బాంబులతో భూగర్భంలో ప్రేలుళ్ళు ప్రేల్చి బంగారం వెండి ఇనుము లోహాలు, పెట్రోలు వగైరా దినుసులన్నీ పైకితీస్తారు. తీసి మనకు అందిస్తారు. అడవుల్ని చదును చేస్తారు. ఇంకా చాలా చాలా మంచిపనులు- అనగా ఎలక్ట్రిసిటీ పుట్టిస్తారు."

"పోదురూ మీదంతా బడాయి. బాంబుల్తో మంచిపనులు చేస్తారంటే నమ్మేదెవరండి? బాంబుల్తో గనులు తవ్వుతార, రోడ్లు వేస్తార్ట, అడవుల్ని చదును చేస్తార్ట" ఇహిహీ అని నవ్వాను.

"నీ నవ్వు చూస్తుంటే విప్లవ నవ్వులా కనిపిస్తోంది. ఇలాంటి వెకిలి నవ్వుల్తో గవర్మెంటునిపడగొట్టాలనిప్రయత్నిస్తున్నట్లు మాకు అనుమానంగా వుంది. నీ నవ్వులో ఏదో కుట్రవుంది" అని పేలారు.

"ఊరుకోండి బాంబులిన్ని ప్రేలిస్తే శాంతి వొస్తుందంటే నమ్మేటంత వెర్రివాళ్ళంకాదు. మావిడికొమ్మకు మల్లెపూలు పూస్తాయా ?" అని వెక్కిరించాను.

"ఎంత సేపూ మామిడివళ్ళు మల్లెపూలు అటంబాంబుతో నువ్వు గోంగూర పచ్చడి పెట్టవచ్చు. ఒడియాలు ఆరబెట్టుకోవచ్చు. బట్టలుతుక్కోవచ్చు. గిన్నెలు, గుమ్మాలు, గడపలు కడుక్కోవచ్చు. అని చెప్పలేదనేగా నీ దుగ్ధ—అయినా నీకు ఇందిరాగాంధిగారు ఎటువంటి మంచిపని చేసినా గిట్టదు. అని వారు తమ అక్కసును బాంబు ఫిలాసఫీని అర్థం చేసుకోలేనందుకు వెళ్ళబెట్టారు."

"సరే కాసుకోండి. అడుగుతునాన్న ప్రశ్నలు. మీ ఇందిరాగాంధి తరపున మీరే జవాబివ్వాలి."

"ఆల్ రైటు! ఆమెకు శిష్యుడ్ని నేను. నీ కుంటి గుడ్డి ప్రశ్నలే అన్సరింపలేదా?"

"అన్సరింపుడు. పరీక్ష అంటే ఏవిటి, పాటన పరీక్ష అంటే ఏవిటి?"

"జపాన్ మీద అమెరికా వేసిన యాటంబాంబు పాటవ పరీక్ష. మన వాళ్ళు రాజస్థాన్‌లో భూగర్భంలో చేసిన పరీక్ష ఉత్తి పరీక్ష. ఈ మాత్రం బుర్రకెక్కలేదా?"

"కాదు. మనం చేసింది పరీక్ష. ఎదటివాడు చేసింది పాటవ పరీక్ష. తప్పారు మొదట్లోనే—"

"నోర్ముయ్, దేశభక్తి హీనురాలా?" అని అరిచారు.

"బాంబును మెచ్చుగుంటే దేశభక్తి వున్నట్టూ లేకపోతే లేనట్టూనా?"

"అది అంతే—ఇప్పటికిది రూలు."

"సరే కానివ్వండి మీకు తెలుసు గదా మన రాణిగారు ట్రిక్కులు చేస్తారని. స్లోగన్లు, గమ్మత్తులు, బెదిరింపులు లాటివి."

"ఛీ! ఛీ! నీవు వారి కుటుంబ చరిత్ర, వారి వారి స్వీయ చరిత్రలు చదవలేదా? నీకు దూరదృష్టి లోపించింది. కళ్ళజోళ్ళషాపుకు వెళ్దామా ?"

"వద్దు. జోళ్ళషాపుకు వెళ్దాము. బాంబుల్తో మనుషులకు మంచి జరుగుతుందని అందుకోసం పరీక్షలంటే మా అడాళ్ళం వప్పుగోలేమండీ"

"మీ ఆడాళ్ళంటున్నావు. మీ ఆడాళ్ళకి పిండి రుబ్బడము సీరియల్స్ చదవటము సినిమాలు చూడ్డం మళ్ళీ పిండి రుబ్బడం, మళ్ళీ సీరియల్స్-"

"ఆపండి మీ నాన్సెన్స్, బాంబుల పరీక్ష ఎందుకు జరిపారో తెలుసా?!"

"పేపర్లో చదువుతున్నాంగా—"

"ఏంటి చదువుతున్నారు గోంగూర."

"మనుషుల్ని భయపెట్టడానికి. వెధవల్లారా సమ్మెలూ, ఊరేగింపులు, ప్రత్యేక రాష్ట్రాలు, అసెంబ్లీల రద్దు. ధరలు తగ్గించాలి. ఉద్యోగాలు కావాలి"అని గొడవలు చేస్తున్నారు. శాంతియుత ప్రయోజనాలకోసం తయారు చేసిన అటంబాంబు మాదగ్గరుంది జాగ్రత్త ! నోరుమూసుకుని కుక్కిన పేనుల్లా పడుండండి అని మన్ని భయపెట్టడానికే - మనందర్నీ హడలుకొట్టడానికే బాంబును ప్రేల్పించారు తెలిసిందా ?"

"ఆహాహా ఎవి థిరీ లాగేవే కుట్రదానా ? బుర్రుందనిపించావు. కాని నీదంతా యాంటీనేషనల్ ఆలోచనలు. ప్రగతినిరోధకపు టూహలు. నిన్ను దేశబహిష్కారము చేసి లేదా ఏదో కుట్రకేసులో యిరికిస్తేనే కాని జలుబు వదలదు. నోరుమూసుకుని పవిత్ర భారత నారిలా అంట్లుతోముకో- ఆలోచించడము మానెయ్."

"మానేస్తాను. మానేస్తాను. గుజరాతులో, ఆంధ్రలో, బీహార్‌లో గొడవలు జరిగాక, పెద్ద సమ్మె జరుగుతున్నప్పుడు శ్రీవారు బాంబు పరీక్ష

శాంతియుతంగా జరిపించారంటే ప్రజల్ని చెదరగొట్టడానికికాక మరెందుకో తెలుసుకోలేనంత అజ్ఞానులం కాము, సీరియల్స్ చదివినా, సైన్స్ చదవక పోయినా మామా ఆలోచన్లు, రీజనింగు. పాలిట్రిక్సూ తెల్సు" అని మా వాదన్ను చిత్తుచేశాను.

తులసికోట దగ్గర పాటలు పాడుకునేవాళ్ళం మాకేం తెలును సైన్సు, రాజకీయాలు అని కొట్టిపారెయ్యకండి. అందుకే నేను వీలునామా రాశాను. ఎవరికీ చెప్పకండి. మా వంశంలో ఎవరూ నా పుత్ర పౌత్రా యిత్యాది వారసులెవరూ అణుబాంబులు కాదుగదా దీపావళికి కూడా బాంబులు చెయ్యడానికి వీల్లేదనీ అలా చేస్తే—వారెవ్వరికీ నాతదనంతరమందు ముక్కుపుడక కూడా దక్కదనీ—బాబోయ్ మావారు బాంబును తొక్కి వస్తున్నట్లున్నారు. ప్రజలకు వుపయోగపడే పన్లు చేయలేనివారు మాత్రమే సర్కస్ ఫీట్లను చేసి చూపిస్తారు. సర్కస్ ఫీట్లను చూసి ఆనందిస్తాము కాని, యింట్లో అవన్నీ చేయలేముకదా. తీగమీద నడవకపోతేనేమి, కత్తులు విసరకపోతేనేమి, రింగులో మోటారు సైకిలు తొక్కక పోతేనేమి, కిరసనాయిలు సూటుకి రాసుకుని మంటల్లో బావిలో దురకకపోతే నేను-యిలాటి వాటివల్ల ఎంత ప్రయోజనము వుందో బాంబుల పరీక్షలవల్ల కూడా అంతే, మన్లో మనమాట. నాకు సీమటపాకాయలంటే భయం. మావారికి తాటాకు టపాకాయ కాల్చడం కూడా రాదు. అందుచేత మేము నూరు నయాపైసల అహింసా వాదులం, మంగళంబు శ్రీరామచంద్రా, మంగళంబు గుణ సాంద్రా!